సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 18 । ఏప్రిల్ । 2023



చీనీ టన్ను రూ.34 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్ట ధర రూ.34 వేలు పలికాయి. మార్కెట్‌కు 722 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.




మే 1 నుంచి ప్రీపీహెచ్‌డీ పరీక్ష

ఎస్కేయూలో పీహెచ్‌డీ చేస్తున్న విద్యార్థులకు మే 1 నుంచి 3 వరకు ప్రీ పీహెచ్‌డీ రాత పరీక్ష నిర్వహించనున్నట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ జీవీ రమణ తెలిపారు.

గరిష్ఠం/కనిష్ఠం

43.2°/ 23.1°

జిల్లా అంతటా సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవి తాపం కొనసాగింది. తూర్పు దిశగా గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.



న్యూస్‌రీల్

బెటాలియన్ కమాండెంట్ బాధ్యతల స్వీకరణ



కమాండెంట్ జగదీష్‌కు స్వాగతం పలుకుతున్న అడిషనల్ కమాండెంట్ నాగేశ్వరప్ప

బుక్కరాయసముద్రం: జంతలూరు వద్దనున్న ఏపీఎస్పీ 14వ బెటాలియన్ నూతన కమాండెంట్‌గా జగదీష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ పని చేస్తున్న అజితా వేజెండ్ల జగ్గయ్య పేట డీసీపీగా బదిలీపై వెళ్లారు. చిత్తూరు అడిషనల్ ఎస్పీగా పని చేస్తున్న జగదీష్ పదోన్నతిపై ఏపీఎస్పీ 14వ బెటాలియన్ కమాండెంట్‌గా నియమితులయ్యారు. నూతన కమాండెంట్ మాట్లాడుతూ బెటాలియన్ అభివద్ధికి కృషి చేస్తామన్నారు. బెటాలియన్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతామన్నారు. అనంతరం అడిషనల్ కమాండెంట్ నాగేశ్వరప్ప, సిబ్బంది కమాండెంట్ జగదీష్‌కు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

పోలీస్ స్పందనలో 50 అర్జీలు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ ఎస్.వి.మాధవరెడ్డి

కొత్తచెరువు: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'స్పందన'కు వివిధ సమస్యలపై 50 అర్జీలు అందాయి. ఎస్పీ ఎస్.వి.మాధవ రెడ్డి అర్జీదారులతో మాట్లాడి సమస్య తీవ్రత తెలుసుకోవడంతో పాటు వెంటనే సంబంధిత పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణ పరిష్కారం చూపేందుకు పోలీసులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రామకృష్ణప్రసాద్, డీఎస్పీలు ఉమామహేశ్వర్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్ల తనిఖీ..

కదిరి టౌన్/నల్లమాడ / తనకల్లు : ఎస్పీ మాధవరెడ్డి సోమవారం నల్లమాడ, కదిరి పట్టణ, తనకల్లు పోలీస్‌స్టేషన్లను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఆయా స్టేషన్ల పరిధిలో నమోదైన కేసులు, దర్యాప్తు గురించి ఆరా తీశారు. నాటుసారా, మద్యం అక్రమ రవాణా, గ్యాంబ్లింగ్‌ను పూర్తి అరికట్టాలన్నారు. అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఎస్పీ వెంట కదిరి డీఎస్పీ భవ్యకిషోర్, సీఐలు మధు, రవీంద్రారెడ్డి, సూర్యనారాయణ, ఎస్‌ఐలు ఉన్నారు.

బిర బిరా.. కృష్ణమ్మ!



గతంలో 120 కి.మీ..

మడకశిర నియోజకవర్గానికి కృష్ణా జలాలను అందించేందుకు గతంలో మడకశిర బ్రాంచ్ కెనాల్ నిర్మించాలని ప్రభుత్వం భావించింది. పెనుకొండ నుంచి సోమందేపల్లి, చిలమత్తూరు, లేపాక్షి, హిందూపురం రూరల్, పరిగి మండలాల మీదుగా 120 కి.మీ మేర కాలువ నిర్మించి మడకశిర నియోజకవర్గానికి కృష్ణా జలాలు ఇవ్వాలని ప్లాన్ తయారు చేశారు. అయితే అంతదూరం కృష్ణా జలాలను తీసుకురావడం వల్ల లక్ష్యం నెరవేరదని భావించి మడకశిర బైపాస్ కెనాల్‌కు రూపకల్పన చేశారు.

ఇప్పుడు 38 కి.మీ..

మడకశిర బ్రాంచ్ కెనాల్‌తో పోలిస్తే బైపాస్ కెనాల్ దూరం చాలా తక్కువ. బైపాస్ కెనాల్ పెనుకొండ మండలం అడదాకులపల్లి వద్ద ప్రారంభమై పరిగి మండలం మీదుగా మడకశిర మండలం అగ్రంపల్లి వరకు వెళ్తుంది. మొత్తంగా బైపాస్ కెనాల్ 38 కి.మీతో పూర్తవుతుంది. తద్వారా నియోజకవర్గంలోని చివరి చెరువుకూ కృష్ణా జలాలు ఇచ్చే అవకాశం ఏర్పడింది.

'ఎంబీసీ' సర్వే ముమ్మరం

- 10 రోజుల్లో సర్వే పూర్తి చేసేలా అధికారుల కసరత్తు
- ఆ వెంటనే కెనాల్ నిర్మాణ పనుల ప్రారంభానికి చర్యలు
- నెరవేరనున్న మడకశిరవాసుల దశాబ్దాల కల

మడకశిర: హంద్రీ నీవా మడకశిర బైపాస్ కెనాల్ (ఎంబీసీ) నిర్మాణంలో మరో ముందడుగు పడింది. నిర్మాణ ప్రక్రియలో చివరి అంకమైన సర్వే వారం రోజులుగా సాగుతోంది. సర్వే కోసం ప్రభుత్వం రూ.కోటి నిధులు కేటాయించగా, 10 రోజుల్లోనే సర్వే ప్రక్రియ మొత్తం పూర్తి చేయడానికి అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

సర్వే ఇలా....

హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలను మడకశిర నియోజకవర్గంలోని అన్ని చెరువులకూ అందించేందుకు ప్రభుత్వం పెనుకొండ–మడకశిర నియోజకవర్గాల మధ్య బైపాస్ కెనాల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. పెనుకొండ మండలం అడదాకులపల్లి నుంచి మడకశిర మండలంలోని అగ్రంపల్లి వరకు బైపాస్ కెనాల్ నిర్మాణం జరగనుంది. ఈ నేపథ్యంలో ఈ రెండు నియోజకవర్గాల్లో బైపాస్ కెనాల్ నిర్మాణానికి రైతుల నుంచి భూసేకరణ చేయనున్నారు. భూనిర్వాసిత రైతులు ఎంతమంది..? ఎంత మేరకు భూమిని కోల్పోతారు..? తదితర వివరాలను సర్వేలో నమోదు చేస్తున్నారు. ఆ తర్వాత రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం అందించనుంది. అదే విధంగా కెనాల్ ఏర్పాటుకు రూట్ సర్వే కూడా చేస్తున్నారు. కెనాల్ పొడవు ఎన్ని కిలోమీటర్లు ఉంటుందో కూడా ఈ సర్వేలో తేలుస్తారు. దాదాపు 38 కిలోమీటర్లు మేర కెనాల్ పొడవు ఉంటుందని ప్రాథమికంగా అధికారులు నిర్ధారించినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా పరిగి మండలంలోని ఊటుకూరు, మడకశిర మండలంలోని అగ్రంపల్లి వద్ద రెండు పంప్‌హౌస్‌లను నిర్మాణానికీ సర్వే పూర్తయ్యింది. కెనాల్ మధ్యలో రెండు బ్రిడ్జ్‌లను నిర్మించనున్నట్లు తెలిసింది. హెచ్ఎన్ఎస్ఎస్ ఈఈ స్వరూప్, డీఈ వెంకటరమణ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ సంస్థ సిబ్బంది, హెచ్ఎన్ఎస్ఎస్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు వారం రోజులుగా సర్వే చేస్తున్నారు.

బైపాస్ కెనాల్ ఉద్దేశం..

మడకశిర నియోజకవర్గం కర్ణాటక సరిహద్దులో ఉంటుంది. హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణా జలాలు నియోజకవర్గంలోని అన్ని చెరువులకూ అందించేందుకు చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యను గుర్తించి ప్రభుత్వం పరిష్కార మార్గాలను అన్వేషించింది. స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామి వినతి మేరకు పెనుకొండ నుంచి నేరుగా మడకశిరకు కృష్ణా జలాలను తీసుకురావడానికి బైపాస్ కెనాల్ మంజూరు చేసింది. ఇందుకుగాను రూ.214.85 కోట్లు మంజూరు చేసింది. ప్రస్తుతం కెనాల్ నిర్మాణ ప్రక్రియ చివరి అంశమైన సర్వేపై కూడా ఫోకస్ చేయడంపై రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

సర్వే పూర్తి కాగానే పనులు



బైపాస్ కెనాల్ నిర్మాణ ప్రక్రియలో కీలకమైన సర్వే కూడా వారం రోజుల క్రితం ప్రారంభమైంది. కొన్ని రోజుల్లోనే సర్వే పూర్తి కానుంది. ఆ వెంటనే పనులు ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటాం. అగ్రిమెంట్‌లో నిర్ణయించిన కాలపరిమితి మేరకు పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తాం. – దేశేనాయక్, ఎస్ఈ, హెచ్ఎన్ఎస్ఎస్

మడకశిరకు సీఎం జగన్ ఇచ్చిన వరం



ఇది మడకశిరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇచ్చిన వరం. బైపాస్ కెనాల్ నిర్మాణంతో రైతుల జీవితాలు తప్పకుండా బాగుపడతాయి. ఈకెనాల్ ద్వారా అన్ని చెరువులకూ కృష్ణా జలాలు అందించడానికి వీలు కలుగుతుంది. మడకశిర ప్రాంతానికి సాగునీరు వచ్చిందంటే అది వైఎస్సార్ కుటుంబం చలువే. బైపాస్ కెనాల్ మంజూరు చేసిన వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం. – డాక్టర్ తిప్పేస్వామి, ఎమ్మెల్యే, మడకశిర

ప్రశాంతంగా 'పది' ఒకేషనల్ పరీక్ష

ప్రశాంతి నిలయం: పదో తరగతి ఒకేషనల్ పరీక్ష సోమవారం జిల్లాలోని 39 కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగింది. 1,367 మంది విద్యార్థులకు గాను 1,360 మంది హాజరయ్యారు. వివిధ కారణాలతో ఏడుగురు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. మంగళవారం పదో తరగతి విద్యార్థులకు సంస్కృతం పరీక్ష ఉంటుందన్నారు.

ఎస్‌ఏ-2 పరీక్షల సమయంలో మార్పులు

పుట్టపర్తి : ఒకటి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఈ నెల 20 నుంచి ప్రారంభం కానున్న ఎస్ఏ-2 పరీక్షల వేళలను ఎండల దృష్ట్యా మార్పు చేశారు. 1 నుంచి 8 తరగతులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగాల్సిన పరీక్షను ఉదయం 8 నుంచి 11 గంటల వరకు నిర్వహించనున్నారు. 9 తరగతి పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు జరగాల్సి ఉండగా.. ఉదయం 8 గంటల నుంచి 11.15 గంటల వరకు నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

'మిషన్ వాత్సల్య'కు 18,452 దరఖాస్తులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: తల్లిదండ్రులను కోల్పోయిన, నిరుపేద, నిస్సహాయ స్థితిలోని పిల్లలకు ఆర్థిక చేయూత కోసం ప్రవేశపెట్టిన 'మిషన్ వాత్సల్య' పథకానికి విశేష స్పందన లభిస్తోంది. 0–18 ఏళ్లలోపు పిల్లల విద్య, వైద్యం కోసం ప్రవేశపెట్టిన ఈ పథకానికి ఈ నెల 15 నాటికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 18,452 దరఖాస్తులు అందాయి. అత్యధికంగా హిందూపురం నుంచి దరఖాస్తులు రాగా, అత్యల్పంగా కణేకల్లు ప్రాజెక్టు నుంచి అందాయి. పరిశీలన తర్వాత అన్నీ సక్రమంగా ఉన్న దరఖాస్తులను కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ ముందు ఉంచనున్నారు. ఎంపికైన ఒక్కో చిన్నారికి నెలకు రూ.4 వేల చొప్పున ఆర్థికసాయం అందుతుందన్నారు. ఇక శ్రీసత్యసాయి జిల్లాలోని పాత ఐసీడీఎస్ ప్రాజెక్టుల వారీగా అందిన దరఖాస్తులను పరిశీలిస్తే హిందూపురం ప్రాజెక్టునుంచి 1,891, కదిరి పడమర 1,325, పెనుకొండ 1,273, ధర్మవరం 1,221, మడకశిర 1,103, చెన్నేకొత్తపల్లి 490, కదిరి తూర్పు ప్రాజెక్టు నుంచి 543 దరఖాస్తులు అందాయి.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్

- ఇఫ్తార్ విందులో కలెక్టర్ అరుణ్‌బాబు



ఇఫ్తార్ ప్రార్థనల్లో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇక్బాల్, కలెక్టర్ అరుణ్‌బాబు తదితరులు

పుట్టపర్తి టౌన్: పవిత్ర రంజాన్ పండుగ మతసామరస్యానికి ప్రతీక అని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి పుట్టపర్తి పట్టణ సమీపంలోని శిల్పారామంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్, పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, ఆర్డీఓ భాగ్యరేఖ, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి రఫీ, చాంద్‌బాషా, వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ ఇమ్రాన్, ముస్లిం మత పెద్దలు, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు. తొలుత మౌలానాలు ఖురాన్ పఠనంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రంజాన్ మాసం విశిష్టతపై పలువురు వక్తలు ఉపన్యసించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ, దైవారాధన, ఆధ్యాత్మిక చింతన, క్రమశిక్షణ, దాతృత్వానికి రంజాన్ మాసం ఉపకరిస్తుందన్నారు. ఉపవాస దీక్షలు, ప్రార్థనలు సోదరభావం, ప్రేమను పెంపొందిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ అల్లా అనుసరించిన మార్గంలో నడవాలన్నారు.

ముస్లిం మైనార్టీలకు పెద్దపీట..

ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ముస్లిం, మైనార్టీలకు పెద్దపీట వేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. దివంగత నేత వైఎస్సార్ ముస్లింలకు 4శాతం రిజర్వేషన్లు కల్పిస్తే, అదేబాటలో ఆయన తనయుడు, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మైనార్టీల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. అన్ని వర్గాలకు సమన్యాయం చేసే దిశగా ప్రభుత్వం ముందుకు వెళుతోందన్నారు. ఉప ముఖ్యమంత్రి పదవితో పాటు నాలుగు ఎమ్మెల్యేలు, నాలుగు ఎమ్మెల్సీ స్థానాలు ముస్లింలకు ఇచ్చారన్నారు. అలాగే శాసనమండలి డిప్యూటీ చైర్మన్ పదవిని ముస్లిం మహిళ ఇచ్చి గౌరవించారన్నారు. ఇక మేయర్, జెడ్పీ చైర్మన్, వైస్ చైర్మన్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, కార్పొరేటర్లు..ఇలా అనేక పదవులను ముస్లింలకు ఇచ్చి సాధికారిత కల్పించారన్నారు.

మరోసారి ఆశీర్వదించండి..

పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, రంజాన్ సోదరభావానికి ప్రతీక అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముస్లింలకు అన్ని విధాలా అండగా నిలుస్తూ అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తోందన్నారు. రానున్న రోజుల్లో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి అండగా నిలిచి మరోసారి ఆశ్వీరదించాలని కోరారు. కార్యక్రమంలో పుట్టపర్తి మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, వైస్ చైర్మన్ తిప్పన్న, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ నూరుల్లా, డైరెక్టర్లు మౌలానా, కలీం, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు సాధిక్, జిల్లా అగ్రీ అడ్వయిజరీ చైర్మన్ రమణారెడ్డి, ఎంపీపీ రమణారెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణ మండల కన్వీనర్లు రంగారెడ్డి, నరసారెడ్డి, మాజీ కన్వీనర్ గంగాద్రి, మాజీ కౌన్సిలర్ నారాయణరెడ్డి, మతపెద్దలు తాజ్మల్ బాషా, మహబూబ్ బాషా, పెనుకొండ మస్తాన్ బాబా తదితరులు పాల్గొన్నారు.

ఈరన్న తిరుగుబాటు

- కోఆర్డినేటర్‌గా 'గుండుమల'ను నియమించడంపై ఆగ్రహం
- టీడీపీ నియోజకవర్గస్థాయి సమావేశానికి డుమ్మా
- పార్టీ పరిశీలకుడు వచ్చినా పట్టించుకోని వైనం

మడకశిర: టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఈరన్న అధిష్టానంపై తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా గుండుమల తిప్పేస్వామికి బాధ్యతలు అప్పగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే సోమవారం పట్టణంలోని యాదవ కల్యాణ మంటపంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి టీడీపీ నాయకుల, కార్యకర్తల సమావేశానికి డుమ్మా కొట్టారు. అంతేకాకుండా తన వర్గం నేతలనూ ఆ సమావేశానికి వెళ్లకుండా అడ్డుకట్ట వేశారు.

రిజర్వు నియోజకవర్గంలో జోక్యం తగదు..

ఎస్సీ రిజర్వు నియోజకవర్గమైన మడకశిర టీడీపీ బాధ్యతల నుంచి ఈరన్నను తప్పించి ఇతర వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామికి అప్పగించడంపై టీడీపీ నేతలే విమర్శిస్తున్నారు. సోమవారం జరిగిన సమావేశంలో పార్టీ నూతన కోఆర్డినేటర్‌గా మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి బాధ్యతలు స్వీకరించగా, ముఖ్యనేతలెవరూ కనీసం శుభాకాంక్షలు తెలపలేదు. నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు పార్థసారథిరెడ్డి కూడా ఈ సమావేశానికి హాజరైనా మాజీ ఎమ్మెల్యే ఈరన్న వర్గం పెద్దగా పట్టించుకోలేదు. ఆయన వర్గానికి చెందిన ఒక్కరంటే ఒక్కరూ హాజరుకాలేదు.

అనుకున్నదొక్కటి... అయ్యిందొకటి

నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా గుండుమల తిప్పేస్వామిని నియమిస్తే పార్టీలో గ్రూపు తగాదాలు సమసిపోతాయని టీడీపీ హైకమాండ్ భావించింది. అయితే పరిస్థితి తారుమారైంది. గతంతో పోలిస్తే ఇప్పుడు గ్రూపు తగాదాలు మరింత అధికమయ్యాయి. ఈరన్న వర్గంగా భావిస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ ప్రకాశ్, మాజీ ఎంపీపీలు ఆదినారాయణ, అశ్వర్థనారాయణ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వీఎం పాండురంగప్ప, రొళ్ల జెడ్పీటీసీ అభ్యర్థి రవిభూషణ్, పట్టణంలోని వాల్మీకి వర్గంతో పాటు నియోజకవర్గంలోని బలమైన వక్కలిగ కులానికి చెందిన పలువురు నాయకులు కూడా ఈ సమావేశానికి హాజరుకాలేదు.

ఆహ్వానించకపోవడం వల్లే!

నియోజకవర్గ స్థాయి పార్టీ సమావేశానికి నూతన పార్టీ కోఆర్డినేటర్ గుండుమల తిప్పేస్వామి తమను ఆహ్వానించలేదని, అందువల్లే తాము గైర్హాజరైనట్లు ఈరన్న వర్గం నేతలు చెబుతున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే తమ దారి తాము చూసుకోవాల్సి వస్తుందని కాస్త గట్టిగా చెబుతున్నారు. మొత్తమ్మీద ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మడకశిర టీడీపీలో గ్రూపు రాజకీయాలు మరింత పెరిగి పార్టీ రెండుగా చీలిపోవడం ఖాయమనిపిస్తోంది.

స్పందించాలి... సమాధానం ఇవ్వాలి



ఫాతిమా సమస్య వింటున్న కలెక్టర్ అరుణ్‌బాబు

గంటలోనే సమస్య పరిష్కారం

ధర్మవరం మండలం పోతులనాగేపల్లి జగనన్న లేఅవుట్‌లో స్థానికురాలు ఫాతిమాకు ప్రభుత్వం పట్టా ఇచ్చి ఇల్లు మంజూరు చేసింది. దీంతో ఆమె ఇంటి నిర్మాణం చేపట్టింది. అయితే పట్టాలో పేరు ఒకలా, ఆన్‌లైన్‌లో మరోలా ఉండటంతో హౌసింగ్ బిల్లులు మంజూరు కాలేదు. దీంతో ఫాతిమా మండల స్థాయిలో ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో ఆమె సోమవారం స్పందనలో కలెక్టర్‌కు తన సమస్య విన్నవించారు. వెంటనే స్పందించిన కలెక్టర్ అక్కడే ఉన్న హౌసింగ్ పీడీని పిలిపించి మాట్లాడారు. కార్యక్రమం ముగిసేలోపు సమస్యకు పరిష్కారం చూపించాలన్నారు. దీంతో హౌసింగ్ పీడీ అక్కడి నుంచే ధర్మవరం మున్సిపల్ అధికారులతో మాట్లాడి పట్టాలో ఉన్న పేరునే ఆన్‌లైన్‌లో నమోదయ్యేలా చూశారు. దీంతో ఫాతిమా అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

- 'స్పందన' అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని సహించను
- పనివేళల్లో అధికారులు అందుబాటులో లేకపోతే ఉపేక్షించను
- కలెక్టర్ అరుణ్‌బాబు హెచ్చరిక

పుట్టపర్తి అర్బన్: '' తమ సమస్య పరిష్కారం అవుతుందన్న ఆశతో ఎక్కడో సుదూర ప్రాంతాల నుంచి జనం కలెక్టరేట్‌కు వచ్చి అర్జీలిస్తారు. వాటిపై తక్షణం స్పందించి పరిష్కారం చూపాలి. పరిష్కరించలేని వాటికి తప్పక సమాధానం చెప్పాలి. గతం గతః... నేటి నుంచి అందే ప్రతి అర్జీకి పరిష్కారం చూపాల్సిందే. ఇందులో ఏదైనా తేడా వస్తే అస్సలు ఊరుకోను. అర్జీలు రీఓపెన్ అయితే చర్యలు తప్పవు'' అని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులు హెచ్చరించారు. సోమవారం ఆయన డీఆర్ఓ కొండయ్య, పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖలతో కలిసి కలెక్టరేట్‌లో నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ సమస్యలపై 93 అర్జీలు అందగా, అర్జీల సమస్యలు ఓపికతో విన్న కలెక్టర్ అరుణ్‌బాబు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆయన వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్షించారు. స్పందనలో ఎక్కువగా రెవెన్యూ సమస్యలపై అర్జీలు వస్తున్నాయని, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. 'స్పందన' పిటీషన్లు ఆన్‌లైన్‌లోకి వచ్చిన వెంటనే ఓపెన్ చేసి చూడాలని, వాటి పరిష్కారానికి ఆయా శాఖల జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పనివేళల్లో ప్రతి అధికారీ అందుబాటులో ఉండాలని, అనుమతి లేకుండా అధికారులు బయటకు వెళ్లకూడదన్నారు.



అర్జీలు రాసేందుకూ సిబ్బంది!

నూతన కలెక్టర్ అరుణ్‌బాబు 'స్పందన'పై ప్రత్యేక దృష్టి సారించారు. గ్రామీణులు, నిరక్షరాస్యులకు ఇబ్బందులు కలగకుండా అర్జీలు రాసేందుకు వివిధ శాఖల సిబ్బందిని అందుబాటులో ఉంచారు. దీంతో స్పందన హాలు కిటకిటలాడింది. సిబ్బంది కూడా ప్రజల సమస్యలను ఓపికతో విని అర్జీలు రాసిచ్చారు. కార్యక్రమం అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడారు. అర్జీలు రాసే సమయం నుంచి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ వరకూ అర్జీదారుడికి ఎలాంటి సమస్య లేకుండా చూడాలన్నారు. అవసరమైతే సిబ్బందిని పెంచాలన్నారు. కార్యక్రమంలో సీపీఓ విజయ్ కుమార్, డ్వామా పీడీ రామాంజనేయులు, పీఆర్ ఎస్ఈ గోపాల్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీపీఓ విజయ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పనిచేసే చోటే నివాసం ఉండాలి

పుట్టపర్తి అర్బన్: జిల్లా, డివిజన్, మండల స్థాయిలో పనిచేసే అధికారులంతా పని చేసేచోటే నివాసం ఉండాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. కార్యాలయం నుంచి బయట ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తే అధికారుల అనుమతి తీసుకోవాలన్నారు. అనుమతి లేకుండా వెళ్తే చర్యలు తప్పవన్నారు. అధికారులు స్థానికంగా ఉన్నారా లేదా అనే విషయంపై రిపోర్టు తయారు చేసి అందజేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన స్పందన హాలు నుంచి మండల, డివిజన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సోమవారం నిర్వహించే 'స్పందన'లో తహసీల్దార్, ఎంపీడీఓ, పోలీస్, పీఆర్, హౌసింగ్ తదితర అన్ని శాఖల అధికారులు పాల్గొనాలన్నారు. అందరూ ఒకేచోట ఉంటే సమస్య పరిష్కారం త్వరగా జరుగుతుందన్నారు. వచ్చే వారం నుంచి ఇది తప్పక అమలు కావాలన్నారు. ప్రతి శుక్రవారం జిల్లా అధికారులు పాఠశాలలు, హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, పీహెచ్‌సీలు, ఆస్పత్రులను సందర్శించాలాన్నారు. ప్రతి శుక్రవారం షెడ్యూల్ ఇస్తామని, ఈమేరకు తనిఖీ చేసి ఫీడ్‌బ్యాక్ ఇవ్వాలన్నారు. వేసవి దృష్ట్యా తహసీల్దార్, ఎంపీడీఓ, కలెక్టరేట్ కార్యాలయాల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాల నియామకం 25వతేదీ లోపు పూర్తి చేయాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌కు సంబంధించి సచివాలయాల్లో డాక్టర్ల ఫోన్ నంబర్లు, పేర్లు ప్రదర్శించాలని, ఏ సమయంలో ఏ డాక్టర్ వస్తారో తెలియజేయాలని సూచించారు.

నీట మునిగి చిన్నారి మృతి


మృతురాలు రెడ్డెమ్మ

పుట్టపర్తి అర్బన్: సరదాగా ఈతకు వెళ్లిన ఓ చిన్నారి నీట మునిగి మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన మేరకు... పుట్టపర్తి మండలం కంబాలపర్తి గ్రామానికి చెందిన చాకలి రాము, రత్నమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరి పెద్ద కుమార్తె రెడ్డమ్మ (8) స్థానిక ప్రాథమిక పాఠశాలలో 3వ తరగతి చదువుతోంది. సోమవారం పాఠశాల వదిలిన తర్వాత మధ్యాహ్నం 2 గంటలకు తాత ఆదెప్ప చెరువు వద్దకు దుస్తులు శుభ్రం చేసేందుకు వెళుతుంటే తన ముగ్గురు స్నేహితులతో కలసి రెడ్డమ్మ కూడా వెళ్లింది. కాసేపటి వరకూ నలుగురు పిల్లలను ఆదెప్ప చెరువులో లోతు తక్కువగా ఉన్న ప్రాంతంలో ఈత కొట్టించి ఒడ్డుకు చేర్చాడు. అనంతరం దుస్తులను ఉతుకుతుండగా.... రెడ్డమ్మతో పాటు మరో ఇద్దరు మరోసారి చెరువులోకి దిగి ఈదలాడసాగారు. లోతు ఎక్కువగా ఉన్న ప్రాంతానికి చేరుకోవడంతో నీట మునుగుతున్న చిన్నారులను గమనించిన ఆదెప్ప వెంటనే ఇద్దరిని ఒడ్డుకు చేర్చాడు. రెడ్డమ్మను వెలికి తీసే లోపు ఊపిరి అందక మృతి చెందింది. సమాచారం అందుకున్న ఎంఈఓ వెంకటరమణనాయక్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు... రెడ్డమ్మ మృతదేహాన్ని చూసి కంటతడి పెట్టారు. బాధిత కుటుంబసభ్యులను ఓదార్చారు.

మెరుగైన సేవలందించాలి

- కలెక్టర్ సుడిగాలి పర్యటన
- చిలమత్తూరు, గోరంట్ల, లేపాక్షి తహసీల్దార్ కార్యాలయాల తనిఖీ


చిలమత్తూరు ఎంపీడీఓ కార్యాలయానికి వస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

గోరంట్ల/చిలమత్తూరు/లేపాక్షి: ప్రజలకు మెరుగైన సేవలందించాలని కలెక్టర్ అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన గోరంట్ల, చిలమత్తూరు, లేపాక్షి మండలాల్లో పర్యటించారు. తొలుత గోరంట్ల వెళ్లిన ఆయన మండల అధికారులంతా అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలు సత్వరం పరిష్కారించాలన్నారు. జాతీయ రహదారులకు సంబంధించిన భూసేకరణ వేగవంతం చేయాలని తహసీల్దార్ రంగనాయకులను ఆదేశించారు. అనంతరం చిలమత్తూరు వెళ్లిన కలెక్టర్ తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. భూముల రీ సర్వేపై ఆరా తీశారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలోనికి వెళ్లి ఎన్ఆర్‌జీఎస్ కార్యాలయం, ఎంపీడీఓ క్యాబిన్, మీటింగ్ హాల్‌ను తనిఖీ చేశారు. వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చూసుకోవాలని, రోగాలు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ రామ్‌కుమార్‌కు సూచించారు. అనంతరం లేపాక్షి తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్...జాతీయ రహదారికి సంబంధించిన రికార్డులు, సమస్యలపై ఆరా తీశారు. కలెక్టర్ వెంట పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, ఆయా మండలాల తహసీల్దార్లు, డిప్యూటీ తహసిల్దార్లు ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మడకశిర ఎమ్మెల్యే


కలెక్టర్ అరుణ్‌బాబును సత్కరిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

పుట్టపర్తి అర్బన్/కొత్తచెరువు: జిల్లా కలెక్టర్ అరుణ్ బాబును మడకశిర ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువ కప్పి, పూలమాల వేసి అభినందించారు. మడకశిర ప్రాంత అభివృద్ధికి సహకరించాలని విన్నవించారు. అనంతరం ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డిని ఆయన చాంబర్ కలసి సన్మానించారు. నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

దేవరకొండపై కారు బోల్తా : వ్యక్తి దుర్మరణం


ఉమాపతి (ఫైల్)


కొండపై నుంచి కిందపడిన కారు

బుక్కరాయసముద్రం: స్థానిక దేవరకొండపై లోయలో కారు బోల్తాపడిన ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. మృతుడిని అనంతపురంలోని వేణుగోపాల్‌నగర్‌కు చెందిన శ్రీవిద్యానికేతన్ స్కూల్ కరస్పాండెంట్ ఉమాపతి (55)గా గుర్తించారు. పోలీసులు తెలిపిన మేరకు... సోమవారం ఉదయం అద్దె కారును మాట్లాడుకుని నార్పలకు ఉమాపతి ప్రయాణమయ్యాడు. బుక్కరాయసముద్రానికి చేరుకోగానే తన మనసు మార్చుకుని దేవరకొండకెళ్లి స్వామిని దర్శించుకుని వద్దామని డ్రైవర్ ఉజ్జినప్పకు తెలిపారు. దీంతో కారును దేవరకొండపైకి డ్రైవర్ చేర్చాడు. ఆ సమయంలో తాను ఓ ఇంపార్టెంట్ కాల్ మాట్లాడాల్సి ఉందని, కాసేపు బయట వేచి ఉండాలన్న ఉమాపతి సూచనతో డ్రైవర్ కారును వదిలి దూరంగా వెళ్లాడు. కారులో ఉమాపతి ఒంటరిగా కూర్చొని ఫోన్‌లో మాట్లాడుతుండగా... ఉన్నఫళంగా పల్లం వైపుగా కారు ముందుకు కదిలింది. గమనించిన డ్రైవర్ కేకలు వేస్తూ ఉమాపతిని అప్రమత్తం చేసేలోపు ఒక్కసారిగా ప్రొటెక్షన్ బీమ్ మీదుగా దాదాపు వంద అడుగుల లోయలోకి కారు దూసుకెళ్లి... దిగువన రోడ్డు మలుపులో బోల్తా పడింది. ఆ సమయంలో మంటలు చెలరేగడంతో ఉమాపతి అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, ఉమాపతికి భార్య కోమలత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సమాచారం అందుకున్న శింగనమల సీఐ అస్రార్ బాషా, ఎస్ఐ జమాల్‌బాషా హుటాహుటిన దేవరకొండకు చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు. ఉమాపతి మృతదేహాన్ని అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

...వారికి మినహాయింపు ఇవ్వండి

- డీఈఓకు ఉపాధ్యాయ సంఘాల నాయకుల విజ్ఞప్తి


డీఈఓ మీనాక్షికి వినతి పత్రం ఇస్తున్న వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు

ప్రశాంతి నిలయం: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనానికి సిబ్బంది నియామకంలో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు డీఈఓ మీనాక్షిని సోమవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కలసి వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, గర్భిణులు, వైకల్యంతో బాధపడుతున్న వారిని, అభ్యర్థన మేరకు ముస్లిం సామాజిక వర్గానికి చెందిన ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. డీఈఓను కలిసిన వారిలో వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జంషీద్, జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీ రమణారెడ్డి, యూటీఎఫ్ జయచంద్ర, నాగేంద్ర, పీఆర్‌టీయూ రజనీకాంతరెడ్డి, రామకృష్ణారెడ్డి, దామోదరరెడ్డి, ఏపీటీఎఫ్ శ్రీనివాసులు, రవీంద్ర, ఏపీటీఎఫ్ (1938) హరిప్రసాదరెడ్డి, శేఖర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుల సంఘం నాయకుడు హరిప్రసాద్, ఎస్టీయూ రామమోహన్, డీటీఎఫ్ సురేష్‌బాబు, పీడీల సంఘం బయారెడ్డి, లష్కర్‌నాయక్ తదితరులు ఉన్నారు.

108 పైలట్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అరబిందో ఈఎంఎస్ 108 అంబులెన్స్ సర్వీసెస్‌లో ఖాళీగా ఉన్న పైలట్ (డ్రైవర్) ఉద్యోగాలకు అర్హులైన వారి నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలైంది. ఈ మేరకు 108 సేవల కో–ఆర్డినేటర్ వీరారెడ్డి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 10వ తరగతి ఉత్తీర్ణత, ట్రాన్స్‌పోర్ట్ హెవీ లైసెన్స్, ఐదేళ్ల అనుభవం, ఇంగ్లిష్ చదవడం, రాయడం వచ్చిన వారు అర్హులు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తులను అనంతపురం సర్వజనాస్పత్రి ప్రాంగణంలోని 108 కార్యాలయంలో స్పందించవచ్చు. ఎంపికైన వారు అనంతపురం జిల్లాలోని బొమ్మనహాళ్, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు, శ్రీసత్యసాయి జిల్లాలోని రామగిరి, పుట్టపర్తి, చెన్నేకొత్తపల్లి, అగళి, మడకశిర, పెనుకొండ, ఓడీసీ, గోరంట్ల, కొత్తచెరువు, కనగానపల్లి మండలాల్లో పని చేయాల్సి ఉంటుంది. పూర్తి వివరాలకు 87901 19419లో సంప్రదించవచ్చు.

ప్రాణాలు బలిగొన్న ఈత సరదా

ధర్మవరం రూరల్: ఈత సరదా ఓ యువకుడి ప్రాణాలు బలిగొంది. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరంలోని పార్థసారథి నగర్‌కు చెందిన రాము, సావిత్రమ్మ దంపతుల కుమారుడు నవీన్‌కుమార్ (24) అవివాహితుడు. తండ్రితో పాటు కార్పెంటర్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం ఈతకొట్టేందుకు పోతుకుంట సమీపంలోని వ్యవసాయ బావి వద్దకెళ్లాడు. అయితే పూర్తి స్థాయిలో ఈత రాకపోవడంతో నీట మునిగాడు. గమనించిన మరికొందరు ఈతగాళ్లు వెంటనే నీట మునిగిన నవీన్‌కుమార్‌ను వెలికి తీశారు. అప్పటికే ఊపిరి అందక అతను మృతి చెందాడు. ఘటనపై ధర్మవరం రూరల్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అంతర్రాష్ట్ర ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్


నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

- 29 వాహనాల స్వాధీనం

బుక్కరాయసముద్రం: జిల్లాలోని పలు ప్రాంతాలతో పాటు కర్ణాటకలోనూ ద్విచక్ర వాహనాలు అపహరించుకెళుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను సోమవారం బుక్కరాయసముద్రం ఇన్‌చార్జ్ ఎస్ఐ జమాల్‌బాషా, సీసీఎస్ ఎస్ఐ నాగరాజు వెల్లడించారు. కర్ణాటకలోని తుమకూరు జిల్లా పావగడ తాలూకా నాగులమడక హోబళి గ్యాడిగుంటె గ్రామానికి చెందిన దూదేకుల బాబు... జల్సాలకు అలవాటు పడి జులాయిగా తిరిగేవాడు. ఈ క్రమంలో తన జల్సాలకు అవసరమైన డబ్బును సులువుగా సంపాదించేందుకు ద్విచక్రవాహనాలను అపహరించుకెళ్లి తక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకునేవాడు. సోమవారం ఉదయం అనంతపురం నగర శివారులోని గోశాల వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా ద్విచక్ర వాహనంపై వచ్చిన దూదేకుల బాషా... పోలీసుల కళ్లు గప్పి ఉడాయించేందుకు ప్రయత్నించాడు. దీంతో అనుమానం వచ్చిన ఎస్ఐలు జమాల్‌బాషా, నాగరాజు, సిబ్బంది వెంబండించి అదుపులోకి తీసుకుని, తమదైన శైలిలో విచారణ చేయడంతో అసలు విషయం వెలుగు చూసింది. దూదేకుల బాషాపై కేసు నమోదు చేసి, అతను ఇచ్చిన సమాచారం మేరకు 29 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.